PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 345 పేజీలు - 08 ఆదివారం 08 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



పాఠకులకు ప్రకటనకర్తలు
శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయం సెలవు కావున సోమవారం పత్రిక వెలబడదు.
తిరిగి పునర్ దర్శనం మంగళవారం

పాలమూరు అభివృద్ధికి అడ్డుపడింది కేసీఆర్ పాలనే!



- జైలు భయంతోనే కాళేశ్వరంపై సీబీఐ విచారణలో జాప్యం
- అందుకే మోడీ ముందు కేసీఆర్ మోకరిల్లారు
- హైదరాబాద్ నుంచి లగచర్లకు బారులు తీరేలా తీర్చిదిద్దుతా
- విద్య, వైద్యం, ఉపాధి కోసం కొడంగల్ బాట పట్టాలి: కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- హకీంపేటలో మంత్రులతో కలిసి రైతు మేళా ప్రారంభం

తొలి అక్షరం/రంగారెడ్డి,నవంబర్ 7 : ప్రాణహితచేవెళ్ల సాగునీటి ప్రాజెక్టుకు నాటి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పిస్తామని చెప్పినా, కేసీఆర్ తన నియంతృత్వ ధోరణితో ప్రాజెక్టు పేరు, ఊరు మార్చి కాళేశ్వరం నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు కూడా అందించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగకుండా కేసీఆర్ ఢిల్లీలో ప్రధాని మోడీ ముందు మోకరిల్లి జాప్యం చేయిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ పేరెత్తితే మామ, అల్లుడికి వణుకు పుడుతోందని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

కొడంగల్ ఎత్తిపోతల టెండర్లలో భారీ దోపిడీ!

- మంత్రి పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా టెండర్ల ప్రక్రియ
- రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్కనీరు అందకముందే ఐదు రెట్లు పెరిగిన అంచనా వ్యయం: కేటీఆర్



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 7 : కొడంగల్‌నారాయణపేటమక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన శనివారం సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. కొడంగల్‌నారాయణపేటమక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలవగా, మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా వాటిలో పాల్గొన్నదని ఆరోపించారు. **నామమాత్రపు కంపెనీలతో టెండర్ల ప్రక్రియ**టెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలుగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం మిగతా2లో...

బీజేపీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టం

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలు బలహీనపడ్డాయి

'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంపై సోనియాగాంధీ ఇంటర్వ్యూ



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 7: బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలన వల్ల దేశ సామాజిక స్వరూపం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థలకు తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అన్నారు. తన జీవిత కథ ఆధారంగా రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం సందర్భంగా 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలను వెల్లడించారు.గత 12 ఏళ్లలో మిగతా2లో...

నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమలో

మోస్తరు వర్షాలు

పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన



రష్యాతో ట్రంప్ రహస్య చర్చలు

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా ప్రయత్నాలు



తొలి అక్షరం/వాషింగ్టన్,నవంబర్ 7 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రేవ్‌తో రహస్యంగా సమావేశమయ్యారు. రష్యాఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశం మిగతా2లో...

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత

పింఛన్లు

నేడు కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 7: దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి ఆదివారం కొడంగల్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు సీఎం స్వయంగా మిగతా2లో...

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

సైనికులతో కలిసి పండుగ జరుపుకుంటా...



తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

- ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు, రేవంత్‌రెడ్డి



దీపావళి పండుగపై భారీ ధరల భారం!

నెయ్యి, వెన్న నుంచి డ్రైఫ్రూట్స్ వరకు భారీగా పెరిగిన ధరలు

70 శాతం వరకు పెరిగిన పిస్తా ధరలు.. 15 శాతం పెరిగిన మిఠాయిల తయారీ వ్యయం



సిద్దిపేట అభివృద్ధి పనులపై హరీశ్‌రావు నిలదీత

- వెటర్నరీ కళాశాల తరలింపుపై ఆగ్రహం.. నిలిచిపోయిన ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ప్రశ్నలు



తొలి అక్షరం/సిద్దిపేట,నవంబర్ 7: సిద్దిపేట జిల్లాలో గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. శేఖర్‌రావుపేటలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు సంధించారు. **కొడంగల్‌లో అభివృద్ధి పనులపై ప్రస్తావన**గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొడంగల్‌లో రెండు 50 పడకల ఆస్పత్రులు, ఫైర్‌స్టేషన్, తండాలకు మిగతా2లో...

పాలమూరు అభివృద్ధికి అడ్డుపడింది కేసీఆర్ పాలనే!

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మేళాలో సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, శ్రీహరితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే పాలమూరు అభివృద్ధి చెందుతుందని ఆశించి 2009లో కేసీఆర్‌ను ఈ ప్రాంతం నుంచి పార్లమెంట్‌కు పంపించారని గుర్తుచేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, మక్తల్‌కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారని తెలిపారు. కానీ కేసీఆర్ పదేండ్ల పాలనలో పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ ప్రాంతానికి రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీలు, సాగు, తాగునీటి సౌకర్యాలను కూడా కల్పించలేదన్నారు. తమ ప్రభుత్వంలో మక్తల్‌నారాయణపేట ఎత్తిపోతల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.గతంలో రైతులకు ఎకరానికి రూ.2 లక్షల పరిహారం కూడా ఇవ్వలేదని, మంత్రి శ్రీహరి రైతులకు ఎకరానికి రూ.20 లక్షల పరిహారం ఇప్పించారని పేర్కొన్నారు. కొడంగల్‌ను విద్య, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్ విమానాశ్రయం నుంచి లగచర్ల ఇండస్ట్రియల్ పార్క్ వరకు అభివృద్ధి విస్తరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాండూరు కంది పప్పును ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేసి స్థానిక రైతుల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రస్తుతం కరువు పరిస్థితుల్లో రైతులకు సాగునీరు అందించలేకపోతున్నామని సీఎం అన్నారు. మేడిగడ్డ కూలిపోవడానికి గత ప్రభుత్వ పెద్దల కమీషన్ల కక్కుర్తే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం లక్షలాది ఎకరాలకు నీరందుతోందని తెలిపారు. ఎల్‌నినో, గోదావరి, కాళేశ్వరం జలాలపై చర్చించేందుకు రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్లు చెప్పారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల వ్యవహారాలపై వాస్తవాలు వెల్లడిస్తామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినో కరువును అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి వచ్చి ప్రజలను కలుస్తానని సీఎం తెలిపారు.

కొడంగల్ ఎత్తిపోతల టెండర్లలో భారీ దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)

సాధించేలా ఈ వ్యవహారం సాగిందని విమర్శించారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు తావులేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.**ఐదేళ్లలో కాదు.. ఐదు రెట్లు పెరిగిన అంచనా వ్యయం** ఈ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం భారీగా పెరగడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని తెలిపారు. అంటే దాదాపు ఐదు రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. ఇంత భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. **తాగునీటి కోసం ప్రజల అవస్థలు** తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. ఒకవైపు ప్రజలు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి, కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. **రాహుల్‌గాంధీ స్పందించాలి** కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్ల వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న ఈ వ్యవహారాన్ని వివరిం చేందుకు క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇలాంటి దోపిడీకి సరిపో యే కొత్త పదాన్ని రాహుల్ గాంధీ సూచించాలని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్లలోనూ అనుకూలమైన సంస్థలకే లబ్ధి చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు

తొలి అక్షరం/అమరావతి, హైదరాబాద్,నవంబర్ 7 : తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. **ప్రతి దీపం సమాజానికీ వెలుగునివ్వాలి: చంద్రబాబు** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని చంద్రబాబు పేర్కొ న్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరి యాలని, ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు. మనం వెలిగించే ప్రతి దీపం ఇంటికే కాకుండా సమాజానికీ వెలుగునివ్వాలని, ఇతరుల జీవితాల్లో సంతోషం నింపడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐకమత్యం, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు.**ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు: రేవంత్‌రెడ్డి** దీపావళి వెలుగులు ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.
పవన్ కల్యాణ్, కేసీఆర్ శుభాకాంక్షలు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

దీపావళి పండుగపై ధరల భారం!

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 7: ఈ ఏడాది దీపావళి పండుగ సంబరాలు సామాన్యుల జేబులకు చిల్లులు పెట్టనున్నాయి. పండుగ మిఠాయిల తయారీకి అవసరమైన నెయ్యి, వెన్న, పాల ఉత్పత్తులతో పాటు డ్రైఫ్రూట్స్ ధరలు భారీగా పెరిగాయి. గత దీపావళితో పోలిస్తే కొన్ని రకాల పిస్తా ధరలు ఏకంగా 70 శాతం వరకు పెరిగాయి. మిఠాయిలు, బహుమతి ప్యాకెట్ల తయారీ వ్యయాలు కనీసం 15 శాతం పెరగడంతో పండుగ ఖర్చులు మరింత భారంగా మారాయి.**పాల ఉత్పత్తుల ధరల పెంపు** పండుగ సమయంలో డిమాండ్ పెరగడం, సరఫరా పరిమితుల కారణంగా అమూల్, నందిని, ఆవిన్ వంటి డెయిరీ సంస్థలు పలు ఉత్పత్తుల ధరలను పెంచాయి. అమూల్ కిలో నెయ్యి ధర రూ.630 నుంచి రూ.680కి చేరింది. 500 గ్రాముల నెయ్యి ప్యాక్ ధర రూ.325 నుంచి రూ.345కి పెరిగింది. 100 గ్రాముల వెన్న ప్యాక్ రూ.63 నుంచి రూ.66కు, 500 గ్రాముల ప్యాక్ రూ.310 నుంచి రూ.325కు చేరింది. ఆన్‌లైన్ మార్కెట్‌లో లీటరు నెయ్యి ధర రూ.700 నుంచి రూ.740 వరకు పలుకుతోంది.**ఆకాశాన్నంటుతున్న డ్రైఫ్రూట్స్ ధరలు** డ్రైఫ్రూట్స్ ధరలు కూడా సామాన్యులకు భారంగా మారాయి. గత దీపావళితో పోలిస్తే పిస్తా ధరలు 60 నుంచి 70 శాతం, బాదం ధరలు 20 నుంచి 40 శాతం పెరిగాయి. మిఠాయిల తయారీలో ఉపయోగించే పెషావరి పిస్తా కిలో ధర రూ.4,000కు చేరింది. పొట్టు తీయని పిస్తా హోల్‌సేల్ ధర ఏడాదిలో 74 శాతం పెరిగి కిలో రూ.1,650కు చేరింది. జీడిపప్పు ధరలు 5 నుంచి 8 శాతం, కిస్‌మిస్ 2 నుంచి 5 శాతం, ఖర్జూరం 5 నుంచి 10 శాతం, అంజీర్ 5 నుంచి 15 శాతం పెరిగాయి. అమెరికాఇరాన్ ఘర్షణల కారణంగా ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి దిగుమతులకు ఎదురవుతున్న సరఫరా సమస్యలు ధరల పెరుగుదలకు కారణమని దిగుమతిదారులు చెబుతున్నారు. **కార్పొరేట్ బహుమతుల బడ్జెట్‌కు కోత** ముడిసరుకులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో మిఠాయిలు, ప్రీమియం గిఫ్ట్ హ్యాంపర్ల ధరలు కనీసం 15 శాతం పెరిగాయి. దీంతో పలు కంపెనీలు ఉద్యోగులు, ఖాతాదారులు, వ్యాపార భాగస్వాములకు ఇచ్చే దీపావళి కానుకల జాబితాను తగ్గిస్తున్నాయి. పెద్ద బహుమతి ప్యాకెట్లకు బదులుగా చిన్న ప్యాకెట్లను ఎంపిక చేసుకుంటున్నాయి.**పెరుగుతున్న ద్రవ్యోల్బణం** సెప్టెంబర్‌లో ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరగా, మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి పెరిగింది. చక్కెర, మిఠాయిల ధరల ద్రవ్యోల్బణం ఆగస్టులో 10.9 శాతం ఉండగా, సెప్టెంబర్‌లో 13.8 శాతానికి చేరింది.

చక్కెర ధరల పెరుగుదల కూడా 24.3 శాతం నుంచి 29.8 శాతానికి ఎగబాకింది. ఈ పరిణామాలతో పండుగ కొనుగోళ్లు సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై మరింత భారంగా మారనున్నాయి.

నదుల అనుసంధానంతోనే నల్లగొండ నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం!

గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానించాలి

డిండి ప్రాజెక్టుపై ప్రభుత్వ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదు: కల్వకుంట్ల కవిత

తొలి అక్షరం/నల్లగొండ,నవంబర్ 7: జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సాగునీటి, తాగునీటి సమస్యలతో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే గోదావరి, కృష్ణా నదుల అనుసంధానమే మార్గమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం



డిండి రిజర్వాయర్ వద్ద నిర్వహించిన ప్రజెంటేషన్‌లో ఆమె మాట్లాడారు. ఏదుల నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలిస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని కవిత విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఉన్న పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకే అవసరమైన నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. గోదావరి జలాలను వినియో గించుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న బస్వాపూర్ రిజర్వాయర్, అనుబంధ పనులను పూర్తి చేయాలని ఆమె సూచించారు. గత ప్రభుత్వ హయా ంలో సాగునీటి రంగంలో జరిగిన తప్పులకు తాను కూడా బాధ్యత వహిస్తానని అంగీకరించిన కవిత, ప్రస్తుత ప్రభుత్వం కూడా కీలక ప్రాజెక్టులను ముం దుకు తీసుకెళ్లడంలో విఫలమైందని విమర్శించా రు. కరువు పరిస్థితులతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీజేపీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం మారిన తర్వాత కూడా వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు చాలా సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లభించడం లేదని, ఎన్నికల సంఘం, ప్రధాన మీడియాపై అధికార పార్టీ ప్రభావం ఉందని విమర్శించారు.తన రాజకీయ ప్రయాణం, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీల నుంచి నేర్చుకున్న విలువలు, 1975-77 అత్యవసర పరిస్థితి, 2004లో ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వంటి అంశాలను ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. ప్రజల్లో అసహనం పెరుగుతోందని, ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణపై తాను ఆశాభావంతో ఉన్నానని సోనియాగాంధీ పేర్కొన్నారు.

నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమలో మోస్తరు వర్షాలు

తొలి అక్షరం/కోస్తాంధ్ర, నవంబర్ 7 :
రాయలసీమ ప్రాంతాల్లో నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్ష సూచన ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రష్యాతో ట్రంప్ రహస్య చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ట్రంప్ వెల్లడించారు. అయితే చర్చల వివరాలను మాత్రం బయటపెట్టలేదు.రష్యాతో సంబంధాలను మెరుగుపరుచుకోవడం ద్వారా చైనారష్యా బంధాన్ని బలహీనపరచడంతో పాటు ఇంధన రంగంలో ఆర్థిక ప్రయోజనాలు పొందాలని అమెరికా భావిస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా నుంచి డీజిల్ దిగుమతులపై కూడా చర్చలు జరిగినట్లు కథనం పేర్కొంది.మరోవైపు, ఈ ఒప్పందం ఉక్రెయిన్ భద్రత, ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రంప్‌పుతిన్ ప్రతినిధుల చర్చలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు.**మూడు వర్గాలకు పింఛన్లు** కొత్తగా మంజూరు చేసిన పింఛన్లలో వితంతువులు, ఒంటరి మహిళలకు 3 లక్షలు, దివ్యాంగులకు లక్ష, కల్లుగీత, చేనేత కార్మికులకు 50 వేల పింఛన్లు కేటాయించారు. మొత్తం 4.50 లక్షల మంది అర్హులకు లబ్ధి చేకూరనుంది. **అన్ని జిల్లాల్లో పంపిణీ** కొడంగల్‌లో కార్యక్రమం ప్రారంభమైన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన వారందరికీ నవంబర్ నెల నుంచే పింఛను మొత్తాన్ని అందించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 7:
దీపావళి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాలు సుఖసంతోషాలు, ప్రశాంతత, విజయాలతో వెలిగిపోవాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో వీడియోను విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా సైనికులతో కలిసి దీపావళి జరుపుకుంటున్న మోదీ.. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని వెల్లడించారు.

సిద్దిపేట అభివృద్ధి పనులపై హరీశ్‌రావు నిలదీత

(మొదటి పేజీ తరువాయి)

రహదారులు, 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించామని హరీశ్‌రావు తెలిపారు. చెరువుల అభివృద్ధితో పాటు ప్రతి మండలంలో గోదాములు నిర్మించామని పేర్కొన్నారు. అలాంటప్పుడు సిద్దిపేటలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు.**నిలిచిపోయిన ప్రాజెక్టులపై ప్రశ్నలు** రంగనాయకసాగర్ కాలువల పనులు గతంలోనే 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మూడేళ్లయినా పూర్తి చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. వెయ్యి పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయని విమర్శించారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడం వెనుక కారణమేంటని ప్రభుత్వాన్ని నిలదీశారు.**రైతులకు ఇచ్చిన హామీలేవీ?** మూడు పంటలకు రైతుబంధు ఇవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో వ్యవసాయ బావుల వద్ద 24 గంటల విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం 7 నుంచి 8 గంటలకే ఎందుకు పరిమితమవుతోందని ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాలతో రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు.మూడేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని ముఖ్యమంత్రి చెబుతున్నారని, ఆ కష్టం ప్రజల కోసమా? కమీషన్ల కోసమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేటలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం!

ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి

ప్రతి భూమికి పట్టాతో పాటు మ్యాప్.. ప్రత్యేక భూధార్ నంబర్: మంత్రి పొంగులేటి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 7 : రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో భూ దోపిడీ జరిగిందని ఆరోపించారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రతి భూమికి పట్టాతోపాటు మ్యాప్ అందజేస్తామని, ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని తెలిపారు.దీంతో భూముల వివరాల్లో పారదర్శకత పెరిగి, భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడటంతో పాటు రాష్ట్రంపై రూ.8.25 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని విమర్శించారు. గత ప్రభుత్వ అప్పులకు ప్రతినెలా రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు.

చీకటిని పారద్రోలే జ్ఞాన దీపాలుగా చిన్నారులు

● త్రినిటీ విద్యాసంస్థల్లో దీపం ఆకారంలో నిలబడి విద్యార్థుల ప్రతిజ్ఞ







తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 7: ఒక దీపం తన వెలుగుతో చీకటిని పారద్రోలినట్లుగా, విద్యార్థులు తమ జ్ఞానమనే వెలుగుతో సమాజంలోని అజ్ఞానం, అహంకారం, అతిస్వార్థం, చంచలత్వం వంటి చెడు లక్షణాలను తొలగించాలని త్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా త్రినిటీ విద్యాసంస్థల్లో విద్యార్థినీ విద్యార్థులు దీపం (ప్రమిద) ఆకారంలో నిలబడి ఐక్యతను చాటుతూ, జ్ఞాన జ్యోతులుగా వెలుగొందుతామని ప్రతిజ్ఞ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, సంస్థ చైర్మన్ కేవీబీ కృష్ణారావు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.జ్ఞానమే నిజమైన వెలుగు.. విద్యార్థులే సమాజ మార్పునకు వెలుగు దివ్వెలు అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

కాంగ్రెస్ నేతలకు పబ్బు రాజు గౌడ్ దీపావళి శుభాకాంక్షలు





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 7:దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ పలువురు పార్టీ ముఖ్య నేతలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బిర్లా ఐలయ్యతో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీకి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని పబ్బు రాజు గౌడ్ ఆకాంక్షించారు.

ప్రభుత్వ సిబ్బందికి దీపావళి కానుకలు అందజేసిన పబ్బు రాజు గౌడ్

● ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు పండుగ కానుకలు పంపిణీ





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 7:దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ తన టీమ్ పీఆర్జీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణం, మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు దీపావళి కానుకలు అందజేశారు.ఈ సందర్భంగా పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి పండుగ ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో కానుకలు అందజేసినట్లు తెలిపారు.ప్రభుత్వ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టీమ్ పీఆర్జీ సభ్యుల సేవలను పలువురు అభినందించారు.

ముత్యాలమ్మ దర్శనానికి రానున్న ఎమ్మెల్యే

● సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలి:కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి



తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 7:మండలంలోని ముంగిమడుగు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ రానున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.

మద్యపాన రహిత గ్రామమే లక్ష్యం.. బెల్ట్ షాపులు పూర్తిగా బంద్ చేయాలి

గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సర్పంచ్ శ్రీలత సుందర్ ఆధ్వర్యంలో అఖిలపక్షాల కీలక నిర్ణయం

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం సీఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి

తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 6: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిర్మూలించి, బెల్ట్ షాపులను శాశ్వతంగా మూసివేయడమే లక్ష్యంగా గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈరోజు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మద్యపానం వల్ల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ఆరోగ్యం, మహిళల భద్రత, యువత భవిష్యత్తును కాపాడేందుకు బెల్ట్ షాపులను పూర్తిగా బంద్ చేయాలని గ్రామసభలో నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ మాట్లాడుతూ.. గ్రామంలో మద్యపానాన్ని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బెల్ట్ షాపుల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో





మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అఖిలపక్ష నాయకులు, గ్రామ పాలకవర్గం కలిసి తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు.గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్ శ్రీలత సుందర్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలు, గ్రామ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. బెల్ట్ షాపుల బంద్‌కు పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, గ్రామస్తులు సమాచారం అందిస్తే వెంటనే దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయ సదానందం, పంచాయతీ కార్యదర్శి కె. పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కడగంచి చలమంద రాజు, సీపీఎం నాయకులు, మాజీ సర్పంచ్ చీరిక సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బోయ అంబేద్కర్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బోయ వెంకట్, కాంగ్రెస్ నాయకులు బోయ రామచందర్, మహిళా సంఘం నాయకులు మాధగోని రమణ, బోయ శైలజ, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి, బోయ హరిత, కిరణ్, గుండెపురం ప్రతిభ, నరేష్, బండ శేఖర్, అంతటి సౌజన్య, ప్రవీణ్, రత్నం, శ్రీకాంత్, బాతరాజు వెంకటేష్ తదితర అన్ని పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒడిబియ్యంతో దుర్గామాతకు మహా అన్నదానం

చీరల వేలంపాటలో మహిళల సందడి.. లక్కీ డ్రాలో పట్టు చీర, శాలువా విజేతలు

తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 7:చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు దుర్గామాతకు సమర్పించిన ఒడిబియ్యంతో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో తయారుచేసిన అన్నప్రసాదాన్ని పెద్ద సంఖ్యలో భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్ది కృష్ణ, గోశిక బలరాజు, సూరేపల్లి శివ, అధ్యక్షులు గోలి శ్రీను, ప్రధాన కార్యదర్శి బత్తుల యశ్వంత్ మాట్లాడుతూ.. అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం చేయడం పవిత్రమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావం, ఐక్యత, సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.చీరల





వేలంపాటలో ఉత్సాహంనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం



వేయగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన లక్కీ డ్రాలో గోశిక కరుణాకర్‌సుమతి దంపతులు చేనేత పట్టు చీరను, పోలోజు వెంకటాచారి పట్టు శాలువాను గెలుచుకున్నారు. విజేతలను ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, పద్మశాలి యువజన సంఘం, చేనేత సహకార సంఘం, భావనారుషి కళానికేతన్ సభ్యులు, దీక్షా భక్తులు, మాతృమండలి సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టిజన్ల హక్కుల సాధనకు నిరంతర పోరాటం

● ఐఎన్టీయూసీ-327 కృషి ఫలితంగా 7 కీలక ఉత్తర్వులు ● రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈనుగాల శ్రీధర్‌కు ఘన సన్మానం ● టీఆర్‌వీకేఎస్ నుంచి 327లోకి ఎల్లగౌడ్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్7: తెలంగాణ విద్యుత్ రంగంలో క్షేత్రస్థాయిలో అహరహం శ్రమిస్తున్న ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలనే లక్ష్యంతో ఐఎన్టీయూసీ– 327 యూనియన్ సుదీర్ఘ కాలంగా జరుపుతున్న పోరాటం ఫలించింది.తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల సీఎండీల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యక్ష సహకారంతో ఆర్టిజన్ కార్మికులకు అనుకూలంగా ప్రభుత్వం 7 కీలక ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ నిర్ణయం ద్వారా ఆర్టిజన్ల గ్రాట్యుటీకి భవిష్యత్ సర్వీస్ రిస్క్ కవరేజ్ లభించడమే కాకుండా, ఇప్పటివరకు పేరు నమోదు కాని డిస్ట్రిబ్యూషన్ అనుమ్యాన్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చొప్పున గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించనుంది. విధి నిర్వహణలో ఉన్నప్పుడు దురదృష్టవశాత్తు ప్రమాదం లేదా ఆకస్మిక మరణం సంభవిస్తే, ఆయా కుటుంబాలకు ఈ



ఉత్తర్వులు కొండంత ఆర్థిక భరోసాను కల్పిస్తాయి. **నాయకులకు ఘన సన్మానం యూనియన్‌లో చేరికలు:** ఆర్టిజన్ల సంక్షేమానికి అనుకూలంగా ఉత్తర్వులు వచ్చేలా నిరంతరం కృషి చేసిన ఐఎన్టీయూసీ – 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈనుగాల శ్రీధర్‌ను తొర్రూర్ డివిజన్ కార్యదర్శి పసుపులేటి మధు ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులు, ఆర్టిజన్లు శాలువాలు, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు.ఇదే ప్రాంగణంలో యూనియన్ పోరాట పటిమకు ఆకర్షితులై టీఆర్‌వీకేఎస్ యూనియన్ నాయకుడు ఎల్లగౌడ్, ఆర్టిజన్ జీఆర్-11 మాతృసంస్థ అయిన 327 యూనియన్‌లో చేరారు. ఈనుగాల శ్రీధర్ ఆయనకు గులాబీ కండువా కప్పి సంస్థలోకి సాధరంగా ఆహ్వా నించారు. **అన్-మ్యాన్ కార్మికుల గుర్తింపు వరకు పోరాటం ఆగదు:** ఈ సందర్భంగా ఈనుగాల శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో కేవలం రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలకే పరిమితం కాకుండా, రాత్రింబవళ్లు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న ప్రతి క్షేత్రస్థాయి కార్మికుడి సమస్య పరిష్కారమే 327 యూనియన్ ప్రధాన ధ్యేయం. క్షేత్రస్థాయిలో మిగిలి ఉన్న అన్-మ్యాన్ కార్మికులను పూర్తిస్థాయి ఆర్టిజన్లుగా గుర్తించే వరకు, వారి పెండింగ్ సమస్యలన్నీ పరిష్కారమయ్యేంత వరకు మా సుదీర్ఘ పోరాటం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొడుపుగంటి ఉపేందర్, బొమ్మర ఎల్లయ్య, రాంబాబు, వెంకటస్వామి, సారంగపాని, దయాకర్, సతీష్, బాబులతో పాటు పలువురు విభాగాధిపతులు, ఆర్టిజన్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జైకేసారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు

సీపీఎం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు




తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 7: జైకేసారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించి, ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం కుప్పలు పేరుకుపోయాయని, మరోవైపు అకాల వర్షాల కారణంగా ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. అధికారికంగా వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ధాన్యం కాంటాలు ప్రారంభించకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులు రేయింబవళ్లు కష్టపడి పండించిన ధాన్యం వర్షాలకు తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి జైకేసారం మార్కెట్‌లో ధాన్యం కాంటాలు ప్రారంభించి, వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య, గ్రామ కార్యదర్శి పొట్ట శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు పల్లె మధుకృష్ణ, బోదాసు వెంకటేశం, వార్డు సభ్యులు పాలమాకుల పుష్ప, రైతులు పాలమాకుల జంగయ్య, ఢిల్లీ నర్సిరెడ్డి, జిల్లెల్ల చిట్టి, నక్క సత్తమ్మ, బండమీది లక్ష్మమ్మ, దొడ్డి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బానోత్ సుందర్ లాల్

● ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి..

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



తొలి అక్షరం/ఏన్కూర్ నవంబర్ 7: వైరా నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ సుందర్ లాల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, ప్రేమానురాగాలను మరింత పెంపొందించాలని అన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పర్యావరణానికి హాని కలగకుండా, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా దీపావళి వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. వైరా నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు బానోత్ సుందర్ లాల్ పేర్కొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేతకు నవంబర్ 15 నుంచి రిలే నిరసన దీక్షలు

- గడువుతో కూడిన తరలింపు ప్రణాళిక ప్రకటించాలి: జేపీసీ చైర్మన్ షేక్ షావలి



తొలి అక్షరం/జవహర్ నగర్, నవంబర్ 7: జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 15 నుంచి రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేపీసీ) చైర్మన్ షేక్ షావలి ప్రకటించారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్యపై జేపీసీ చేపట్టిన ప్రజా ఉద్యమం వల్లే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు స్పందించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయని పేర్కొన్నారు. ఈ పోరాటం ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, 30 గ్రామాలకు చెందిన సుమారు 40 లక్షల మంది ప్రజల ఆరోగ్యం, భద్రత కోసమేనని స్పష్టం చేశారు. నాగారంలో నవంబర్ 3న జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రకటించిన 108 రోజుల కార్యాచరణపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక, నిధులు, పర్యావరణ అనుమతుల రద్దుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గడువు తేదీతో కూడిన తరలింపు ప్రణాళికను లిఖితపూర్వకంగా ప్రకటించాలని కోరారు. రిలే దీక్షల అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడి, ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్రలు చేపడతామని హెచ్చరించారు. మచ్చ బొల్లారం చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రభుత్వ భూమి కేటాయించినట్లు వస్తున్న ప్రచారాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో నిజం ఉంటే సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలని అన్నారు. డంపింగ్ యార్డు సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు బాధ్యత నెట్టకుండా తక్షణ పరిష్కారం చూపాలని షేక్ షావలి డిమాండ్ చేశారు. శాంతియుతంగా జరిగే దీక్షలకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 14ను వెంటనే రద్దు చేయాలి

● బీసీ సంఘాల స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయంటూ నాయకుల ఖండన



తొలి అక్షరం ఏన్కూర్/ నవంబర్ 7: ఏన్కూరు మండల కేంద్రంలో శనివారం బీసీ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో బీసీ సంఘాల కోసం ఐదు ఎకరాల భూమి కేటాయింపుతో పాటు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయంపై చర్చించారు. అయితే బీసీ సంఘాలకు ఐదు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ జీవో నంబర్ 19 జారీ చేసిన ప్రభుత్వం, మరోవైపు జీవో నంబర్ 14 ద్వారా బీసీ సంఘాలపై నియంత్రణ విధించే ప్రయత్నం చేస్తోందని నాయకులు ఆరోపించారు. బీసీ సంఘాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకువచ్చి వాటి స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఈ జీవో ఉందని వారు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 14ను రద్దు చేయాలని, బీసీ సంఘాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా బీసీ సంఘాలు స్వతంత్రంగా పనిచేసుకుంటూ తమ తమ కులాల అభివృద్ధికి కృషి చేసేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు గిద్దగిరి సత్యనారాయణ, కొవ్వూరి నాగేశ్వరరావు, దేశ గణేష్, నల్లమోతు రమేష్, కొంటూ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో ఆర్టీఓ రహదారి అధ్వానం

గుంతలమయంగా ఆర్టీఓ కార్యాలయ రహదారి

సోలిపూర్ 5వ వార్డులో మురుగునీటి సమస్య..

పట్టించుకోని అధికారులు!





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ 5వ వార్డు భాగీరథ కాలనీ నుంచి వస్తున్న మురుగునీరు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లే రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. దీంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు గుంతల్లో నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఇతర పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు ఆర్టీఓ కార్యాలయానికి వస్తుంటారు. ఈ మార్గంలో మురుగునీరు ప్రవహిస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రహదారిపై గుంతలు, మురుగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో పాటు రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రశ్నించినందుకే కేసులు పెట్టి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం.

బోయిని నరసింహ యాదవ్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చౌటుప్పల్ మండలం



తొలి అక్షరం / చౌటుప్పల్, నవంబర్ 7: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ అక్రమ అరెస్టును బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,బోయిని నరసింహ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కాలని చూస్తోందని విమర్శించారు. దూదిమెట్ల బాలరాజ్ యాదవ్‌కు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులకు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ నాయకులు భయపడరని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని బోయిని నరసింహ యాదవ్ హెచ్చరించారు.

కార్పొరేటర్‌ల పదవీ కాలం ముగియడంతో స్తంభించిన పాలన

- మొద్దు నిద్రలో స్పెషల్ ఆఫీసర్లు: డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: పరిసరాల పరి శు భ్రత ప్రజల అందరి బాధ్యత-పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుందాం-కార్పొరేటర్లు లేని మహా నగర పాలక సంస్థ వరంగల్ కు సహకరిద్దాం అని కాబోయే కార్పొరేటర్ డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్ పిలుపునిచ్చారు.ప్రతీ రోజూ ఇంటికి చెత్తను సేకరించే స్వచ్ఛ భారత్ ట్రాలీ ఆటో వస్తూ ఉన్న తర్వాత కూడా మీ ఇంట్లో తయారయిన చెత్తను వేరే వారి ఇంటి ముందో లేక పార్కు ప్రహరీ గోడల చుట్టూ వేస్తున్నారంటే మీరు సామాజిక స్పృహ లేని వారైనా అయి ఉండాలి లేక మీరూ ఏ మాత్రం చదువు కోని వారయినా అయి ఉండాలి.అందులో మీరూ ఏ కోవకు చెందిన వారో మీరే తేల్చుకోండి అని ప్రజలకు సూచించారు.గ్రేటర్ వరంగల్ పరిధిలో గత ఆరు నెలల క్రితం కార్పొరేటర్ ల పదవీ కాలం ముగియడం తో మాజీ కార్పొరేటర్లు ఇక మాకు ప్రజలతో మాకేమి పని అని ప్రజల సమస్యలను పట్టించుకోవడం మానేసారు.ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలన కొన సాగుతుండటంతో స్పెషల్ ఆఫీసర్లు మొద్దు నిద్రలో ఉన్నట్టు గా కనిపిస్తూ ఉన్నది.గ్రేటర్ వరంగల్ పరిధిలో సుమారు ఆరు లక్షల అరవై వేల ఓటర్లు ఉండగా కార్పొరేటర్లు లేక పోవడం తో పాలన స్తంభించి పోయింది కావున వెంటనే గ్రేటర్ వరంగల్ లో ఎన్నికలు నిర్వహించాలని సామాజిక వేత్త కేడల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మన ఇంట్లో తయారైన తడిచెత్త సేకరించడానికి ప్రభుత్వం ప్రతీ ఇంటికీ ఒక గ్రీన్ బకెట్,పొడి చెత్త కు బ్లూ బకెట్ ఇచ్చిన తర్వాత కూడా చెత్తను ప్లాస్టిక్ కవర్లలో, సంచులలో కట్టి,చుట్టి వేరే వాళ్ల ఇంటి ముందు వేసి పోయే వారిని ఏమనాలి అలా చెత్త తో కలిసి చుట్టిన కవర్లను,సంచులను మీ ఇంట్లోనే భద్రంగా దాచుకొని ఉదయం లేవగానే మీ ఇంటి ముందుకు మైకు పెట్టుకొని వచ్చే స్వచ్ఛ భారత్ ఆటోలో వేయండి ఒక వేళ స్వచ్ఛ భారత్ ఆటో రాకపోతే నా మొబైల్ నెంబర్ కు కాల్ చేయండి నేను పంపిస్తాను అని ఈ సందర్భంగా కేడల ప్రసాద్ తెలిపారు.



ప్రతి ఇంటా సుఖసంతోషాల వెలుగులు నిండాలి

● ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



తొలి అక్షరం / చౌటుప్పల్, నవంబర్ 7: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆనందం, ఐశ్వర్యం నింపాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతులు వెలిగించాలని పిలుపునిచ్చారు. బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, చిన్నపిల్లల విషయంలో పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్తీక మాసంలో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

టపాసుల మోతలో ప్రమాదాలకు తావివ్వొద్దు!

- పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- దీపావళి వేడుకల్లో అప్రమత్తతే ముఖ్యం: ఎస్ఐ బానోత్ వెంకన్న



తొలిఅక్షరం /నర్సింహులపేట నవంబర్ 7: దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, అయితే వేడుకల పేరుతో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని నర్సింహులపేట ఎస్ఐ బానోత్ వెంకన్న ప్రజలకు సూచించారు. టపాసులు కాల్చే సమయంలో ముఖ్యంగా చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, ముందస్తు జాగ్రత్తగా నీటి బకెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రమాదకరమైన టపాసులకు దూరంగా ఉండటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేలా జాగ్రత్తలు పాటించాలని కోరారు.పండుగ సంబరాలు విషాదంగా మారకుండా పోలీసుల సూచనలు పాటించాలని, ప్రజలందరూ సురక్షిత వాతావరణంలో దీపావళి వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ బానోత్ వెంకన్న తెలిపారు.

పేద విద్యార్థుల చదువుకు అండగా..: మంత్రి బండి సంజయ్ కుమార్



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 463 మంది విద్యార్థినీ విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు మొత్తం రూ.57,875/- ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ స్వయంగా చెల్లించారు.ఈ విషయానికి సంబంధించిన వివరాలను హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రవికి భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కోలను సంతోష్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...పేద,మధ్యతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ...ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే గొప్ప సంకల్పంతో బండి సంజయ్ కుమార్ చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్,సిద్ధిపేట జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మాచర్ల కుమారస్వామి,భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్,బి జే వై యం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన



తొలి అక్షరం/ నెల్లికుదురు నవంబర్ 07: నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో ఉన్న రైతు వేదిక కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి భూక్యా మహేందర్, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా వావిలాల రెవెన్యూ గ్రామం నందు ఎంపిక చేయబడిన 125 మంది ప్రకృతి వ్యవసాయ రైతులకు యాసంగి సాగులో పాటించాల్సిన మెళుకువలు యాజమాన్య పద్ధతులు,తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పడం జరిగింది.పురుగు మందులు, రసాయనిక ఎరువుల వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన పశువుల పేద, ఆవు మూత్రం, వేప గింజలు మొదలకు ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన పర్యావరణ హితంగా కొనసాగాలని తెలపడమైనది. ఈ కార్యక్రమంలో ఏఇవో మణికంఠ , సిఆర్పి లు జాతోతు రమేష్, సమకూరి సునీత 125 మంది గ్రామ పకృతి వ్యవసాయ రైతు సోదరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో మంటలు.. తప్పిన పెను ప్రమాదం

- మిషన్ భగీరథ పైపులైన్‌కు తప్పిన ముప్పు
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది.. అదుపులోకి మంటలు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత రహదారి వద్ద వ్యవసాయ క్షేత్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న పొలంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అదే ప్రాంతంలో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉందని భావించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆలస్యం చేయకుండా అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి ప్రయత్నం అనంతరం మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మిషన్ భగీరథ పైపులైన్‌కు ఎలాంటి ప్రమాదం జరగకుండా పెను ముప్పు తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి ప్రమాదాన్ని నివారించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో జరిగిన నష్టంపై వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

శంకరన్న సహకారంతో నందిగామలో చిరకాల కల సాకారం

- ఎమ్మెల్యే శంకర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం: మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో తమ చిరకాల కల సాకారమైందని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో గత పదేళ్లుగా ఎంపీడీవో కార్యాలయానికి సొంత భవనం లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సహకరించారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా భవనాల ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి విషయంలో గత పాలకులకు, ప్రస్తుత ఎమ్మెల్యేకు పోలిక లేదని, శంకరన్నకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని శివశంకర్ గౌడ్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి.. ఆచూకీ కోసం షాద్‌నగర్ పోలీసుల విజ్ఞప్తి

- మహిళ మృతదేహం గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నం
- మృతురాలి వివరాలు తెలపండి.. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని గాయత్రి హాస్పిటల్స్ పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. నవంబర్ 6న మహిళ మృతి చెంది ఉండటాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని భద్రపరిచేందుకు షాద్‌నగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) మార్చురీకి తరలించి భద్రపరిచినట్లు వెల్లడించారు. అయితే మృతురాలి వివరాలు, కుటుంబ సభ్యుల ఆచూకీ ఇంకా తెలియరాలేదని తెలిపారు. మహిళను గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. మృతురాలి ఫొటోను వాట్సాప్ గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ చేయాలని కోరారు. తద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మృతురాలిని గుర్తించిన వారు, ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసిన వారు వెంటనే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళ ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు.

ఫ్రాంక్‌ఫిన్ ఏవియేషన్ సంస్థపై సమగ్ర విచారణ చేపట్టాలి

- నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి: ఏఐఎస్ఎఫ్



తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: ఫ్రాంక్‌ఫిన్ ఏవియేషన్ సంస్థ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి,ఆ సంస్థ ద్వారా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడానికి వెళ్లగా,కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)కె.శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్ మాట్లాడుతూ...ఫ్రాంక్‌ఫిన్ ఏవియేషన్ సంస్థ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి,భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసి,అనంతరం సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజుల రూపంలో చెల్లించినప్పటికీ,వారికి తగిన న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఇలాంటి విద్యాసంస్థల వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి,సమగ్ర విచారణ చేపట్టాలని,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు వారి ఫీజులను తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ప్రణీత్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్,జిల్లా సమితి సభ్యులు మాలేబోయిన రామ్ చరణ్,రావుల చరణ్,ఆలేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

హోల్‌సేల్,రిటైల్ రైస్ డిపోలలో అధికారుల తనిఖీలు





తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు,వరంగల్ మండల పరిధిలోని ఓల్డ్ బీట్ బజార్ ప్రాంతంలో ఉన్న హోల్‌సేల్ మరియు రిటైల్ రైస్ డిపోలలో జిల్లా పౌర సరఫరాల అధికారి,లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు,ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహశీల్దార్ వరంగల్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా,అన్నీదుకాణాల ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల వివరాలతో కూడిన ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చెయ్యవలసినదిగా ఆదేశించినారు.మొత్తం (3) దుకాణాలను తనిఖీ చేసి,సంబందిత రికార్డులు,పత్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా,ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే బియ్యాన్ని విక్రయించాలని, ధరల విషయంలో వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని దుకాణ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా, తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి లీగల్ మెట్రాలజీ శాఖ పరిది లో అధికారులు ఒక కేసు నమోదు చేశారు.

కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు.







తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 7: రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. దీపావళి పండుగను కాలుష్య రహితంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల మైదానంలో దీపావళి పండుగను పురస్కరించుకొని పలు భంగిమల ఆకారంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. సురేష్, అకాడమీ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులకు న్యాయం చేయాలి

- బీఎస్పీ మండల అధ్యక్షుడు నకిరేకంటి నరేష్ డిమాండ్



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 7: ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో నిజమైన నిరుపేదలు, ఇళ్లు లేని కుటుంబాలకు ప్రాధా న్యత ఇచ్చి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని బీఎస్పీ రామన్నపేట మండల అధ్యక్షుడు నకిరేకం టి నరేష్ డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యం, పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందించాలని కోరారు. ఏళ్లుగా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు న్యాయం చేయాలని, అర్హులకు ఇళ్లు మం జూరు చేయకపోతే బీఎస్పీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తిమ్మాపూర్‌లో మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల సందడి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం షాద్‌నగర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముఖద్వారమైన తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, నినాదాలతో స్వాగత కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, నందిగామ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తిమ్మాపూర్‌కు చేరుకోవడంతో సందడి నెలకొంది. అనంతరం మంత్రి నందిగామ మండలంలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు బయలుదేరారు.



కాంగ్రెస్ నాయకుల కుటుంబాలకు ఎమ్మెల్యే మురళి నాయక్ పరామర్శ

తొలి అక్షరం/కేసముద్రం నవంబర్ 07: కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వేం నరేందర్ రెడ్డి అనుచరుడు, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాల కృష్ణమూర్తి అనారోగ్యం తో మరణించగా పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భుక్యా మురళి నాయక్ వారి గ్రామానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని, ఇలాంటి సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు అండగా ఉండాలని కోరుకున్నారు.కాంగ్రెస్ కుటుంబాలకు నేను ఎప్పుడు అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా నాకు తెలియజేయాలనీ వారి కుటుంబానికి వివరించారు.అలాగే అదే గ్రామానికి చెందిన గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, తల్లి అనారోగ్యం తో ఉన్నదని తెలియగా వారి ఇంటికి వెళ్లి వెంకన్న తల్లి ని పరమార్శించి ఆరోగ్యం, యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు.కేసముద్రం, మున్సిపాలిటీ పరిధిలోని వెల్డింగ్ సలీం తండ్రి రంజాన్ షేక్ మరణించగా వారి



దస్వా (దశదిన ఖర్మ)లో పాల్గొని వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని, వారి కుటుంబాన్ని పరమర్శించారు.కేంద్రంలో పలువురిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఉప్పరపల్లి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,బండారు దయాకర్,గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు,పీసీసీ సభ్యులు దస్రు నాయక్,కౌన్సిలర్ వీరేష్ యాదవ్,ముదిగిరి సాంబయ్య,యువజన నాయకులు తండా శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరిగే విజేందర్, వార్డు సభ్యులు జనిగల అనిల్ కుమార్, భువనగిరి జ్యోతి, రమేష్, పలుస పద్మ, వెంకన్న, కంచ రాజ్ కుమార్, తండా సంపత్, బండారు దయాకర్, ఎటురోజు సత్యనారాయణ, మద్ది శ్రీనివాస్, నలగుర్తి ఉప్పలయ్య, మంద విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

●నీటిని ఆదా చేయండి.. మెట్ట పంటలకే ప్రాధాన్యత ఇవ్వండి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 7: రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. శుక్రవారం రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.మూసీ పరివాహక గ్రామాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉండవచ్చని హెచ్చరించారు. చెరువులు, నీటి ట్యాంకుల్లోని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే మెట్ట పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు.సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక అధికారి రాఘవరెడ్డిని ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, రాబోయే పరిస్థితులపై ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు కొత్త ఇళ్లలో దీపావళి జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఎంపీడీవో ఏ. రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఇంటి దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

తాళం వేసిన ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్ట్

సాంకేతిక ఆధారాలతో దొంగ పట్టివేత.. ఆభరణాలు స్వాధీనం

తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను షాద్‌నగర్ సీఐ సీతారాం నవంబర్ 7న మీడియాకు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈశ్వర్ కాలనీకి చెందిన రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి అనారోగ్యంతో ఉన్న మేనమామను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఈ



క్రమంలో ఇంటికి తాళం వేసి వెళ్లగా, అక్టోబర్ 2న తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి జగన్నాథ ప్రభు (32)ను గుర్తించి అరెస్టు చేశారు. ఇంటి ప్రహరీ దూకి లోపలికి ప్రవేశించిన నిందితుడు ఇనుప రాడ్డుతో తాళాలు, బీరువా పగలగొట్టి ఆభరణాలు అపహరించినట్లు విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితుడి నుంచి బంగారు చెవి కమ్మలు, గొలుసులు, నల్లపూసల దండ, బ్రేస్‌లెట్ తదితర ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ శిరీష రాఘవేంద్ర, ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సీఐ సీతారాం, క్రైమ్ డీఎస్ఐ శివరెడ్డి, సిబ్బంది కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించారు. సిబ్బందికి బహుమతులు అందించనున్నట్లు పోలీసులు తెలిపారు.

కిసాన్ సభ జాతీయ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలి

●రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపు ●రామన్నపేటలో బైక్ ర్యాలీ



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 7: ఈ నెల 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. సభ విజయవంతం కోసం శనివారం రామన్నపేటలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు, పంటలకు చట్టబద్ధమైన మద్దతు ధర, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి, కనీస వేతనాలు కల్పించాలన్నారు. రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేసే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోం

పేదల విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అంతర్జాతీయ పాఠశాలలు

తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 7: పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా





బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు.



రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. భూధార్ విధానంతో భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డు విషయంలో ఎమ్మెల్యే విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయబోమని స్పష్టం చేశారు.

దీపావళి వేడుకల్లో అప్రమత్తతే ముఖ్యం

●షాద్‌నగర్‌లో బాణసంచా దుకాణాల లైసెన్సులకు 61 దరఖాస్తులు.. ప్రమాదాల నివారణకు రెండు ఫైర్ ఇంజన్లు సిద్ధం





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 7: దీపావళి సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. బాణసంచా దుకాణాల లైసెన్సుల కోసం 61 దరఖాస్తులు వచ్చినట్లు ఫైర్ సేఫ్టీ ఎన్ఫో సదకుల కిషన్ తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు రెండు ఫైర్ స్టేషన్లు, రెండు ఫైర్ ఇంజన్లు, 17 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.ప్రజలు బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం లైసెన్సులు పొందిన దుకాణాల్లోనే టపాసులు కొనుగోలు చేయాలని, సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు.



●లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇంట్లో తొలి దీపావళి సంబరాలు

తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: జిల్లెడు చౌదరిగుడ మండలంలోని జాకారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంతింట్లో తొలి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి పండుగ సంబరాలు చేసుకున్నారు. సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ కుటుంబాలతో కలిసి ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇండ్లు యాప్‌లో, సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌తో పాటు ప్రదీప్, గోపాల్, వెంకటయ్య, మహేష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్ఓబీ నిర్మాణ జాప్యానికి రాష్ట్ర నిధుల కొరతే కారణం

- చట్టాన్‌పల్లి ఆర్ఓబీ పనులు వేగవంతం చేయాలి: పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 07: షాద్‌నగర్ చట్టాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఎల్‌సీ-27) నిర్మాణంలో జాప్యానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల కాకపోవడమే ప్రధాన కారణమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. 2023లోనే మక్తమాదారం రోడ్డులో ఆర్ఓబీకి శంకుస్థాపన జరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం నిధులు సమకూర్చేలా ప్రాజెక్టు రూపొందించారని తెలిపారు. డిజైన్ మార్పులతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. 2024 ఆగస్టు 19న రైల్వే బోర్డు 100 శాతం రైల్వే నిధులతో నిర్మాణం చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఎంపీ డీకే అరుణ 2025లో రెండుసార్లు రైల్వే శాఖకు లేఖలు రాసి పూర్తిస్థాయి నిధులు కేటాయించాలని కోరినట్లు వెల్లడించారు. రాజకీయ ప్రకటనలు కాకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని, ఆర్ఓబీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాల కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: గ్రేటర్ వరంగల్‌లోని 44, 45, 64వ డివిజన్లలో రూ.3 కోట్లకు పైగా నిధులతో చేపట్టనున్న రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి శంకుస్థాపన చేశారు. కడిపికొండ రాజీవ్ గృహకల్ప ప్రాంతంతో పాటు సింగారం, కొత్తపల్లి, ఇంటీరియల్ కాలనీలో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలి

● రాష్ట్రస్థాయిలో హనుమకొండ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హనుమకొండ జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అధికారులకు సూచించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల ముందస్తు నమోదు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, సాధారణ ప్రసవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చిన్నారుల టీకాల వివరాలను యూ-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని, క్షయ, హెచ్ఐవీ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెనుకబడిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలు సాధించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

నూతన జడ్జికి అంజయ్య యాదవ్ అభినందనలు

- న్యాయమూర్తిగా ఎంపిక కావడం పట్టణానికి గర్వకారణం



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 7: షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఆగిరు లక్ష్మీ ప్రసాద్ నూతనంగా న్యాయమూర్తిగా ఎంపిక కావడంతో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం లక్ష్మీ ప్రసాద్ నివాసానికి వెళ్లిన ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయమూర్తిగా ఎంపిక కావడం వ్యక్తిగత విజయమే కాకుండా షాద్‌నగర్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. కష్టపడి సాధించిన ఈ విజయంతో యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో న్యాయవ్యవస్థలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు న్యాయం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నటరాజన్, కౌన్సిలర్ ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, నందకిషోర్, నాయకులు చీపిరి రవి యాదవ్, జమాల్ ఖాన్, శివాజీ నాయక్, సాయి యాదవ్, వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి..

రోగుల ప్రాణాలకు భరోసా ఏదీ?

పైకప్పు పెచ్చులూడి.. బయటపడిన తుప్పుపట్టిన ఇనుప చువ్వలు

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.. బీఎస్పీ నాయకుడు నీరటి రాజు డిమాండ్





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 7: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రి వార్డుల్లో పైకప్పు పెచ్చులూడి సిమెంట్ పొరలు కూలిపోవడంతో పాటు తుప్పుపట్టిన ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలు సైతం దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఈ పరిస్థితులపై బీఎస్పీ నాయకుడు నీరటి రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆసుపత్రిని సందర్శించిన ఆయన చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులను పరామర్శించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు చికిత్స పొందుతున్న వార్డుల్లో ఇలాంటి పరిస్థితులు ఉండటం బాధాకరమన్నారు. పైకప్పు పెచ్చులు రోగులపై పడితే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రి భవనానికి వెంటనే భద్రతా తనిఖీలు నిర్వహించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల చెరుకుపల్లికి చెందిన రాధ, ఆమె శిశువు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడకుండా వైద్యాధికారులు తక్షణమే స్పందించి సురక్షిత వైద్య వాతావరణం కల్పించాలని నీరటి రాజు డిమాండ్ చేశారు.

శుభప్రద,విద్యాధర్ దంపతులకు ఇంటర్నేషనల్ డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్7: హనుమకొండ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్‌లో శనివారం (నవంబర్ 7) కొమ్ము శుభప్రద, విద్యాధర్ (డైరెక్టర్, ప్లానింగ్) దంపతుల సర్వీస్ రిటైర్మెంట్, 31వ వివాహ వార్షికోత్సవ కృతజ్ఞతా సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలూరి విల్సన్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యాధర్ రచించిన ఆత్మీయ రాగాలు అనే క్రైస్తవ భక్తి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ శుభప్రద, విద్యాధర్ దంపతులు సమాజానికి, ఆధ్యాత్మిక రంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ వారిని ఇంటర్నేషనల్ డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుతో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డును సింగర్ కుమారి శృతి షారోన్ చేతుల మీదుగా దంపతులకు అందజేశారు. ఈ వేడుకలో పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వృద్ధులు, చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● వసతి గృహాల్లో కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకస్మిక తనిఖీలు ● వృద్ధులతో ఆత్మీయ పలకరింపు.. సమస్యలపై ఆరా ● శిశు గృహంలో మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు



తొలి అక్షరం/కరీంనగర్,నవంబర్ 7: వయోవృద్ధులు, దివ్యాంగులు, అనాథ చిన్నారులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శనివారం రాత్రి కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ వయోవృద్ధులు, దివ్యాంగుల ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. వృద్ధులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గీజర్‌తో పాటు ఇతర అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఆదివారం వసతి గృహంలోని వృద్ధులకు టపాసులు, స్వీట్లు అందిస్తామని పేర్కొన్నారు. **శిశు గృహంలో సౌకర్యాలపై ఆరా** అనంతరం క్రిస్టియన్ కాలనీలోని శిశు గృహాన్ని కలెక్టర్ సందర్శించారు.



అక్కడి చిన్నారులను పరిశీలించి వారి బాగోగులు, అందుతున్న సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిశు గృహానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. భవనాన్ని అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చి పూర్తిస్థాయి చైల్డ్ కేర్ సెంటర్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి 'కాకా'పై పుకార్లకు చెక్..

సంక్రాంతికి రిలీజ్ పక్కా: కోన వెంకట్



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కాకా' విడుదలపై గత కొద్దిరోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ప్రముఖ రచయిత కోన వెంకట్ తనదైన శైలిలో తెరదించారు. సినిమా సంక్రాంతికి రావడం లేదంటూ వస్తున్న వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ ఘాటైన పోస్ట్ చేశారు."'కాకా' సినిమాపై వస్తున్న అన్ని పుకార్లకు, నిరాధార కథనాలకు ఇక సెలవు. మిమ్మల్ని నిరాశపరుస్తున్నందుకు క్షమించండి, కానీ మేము జనవరి 13న ల్యాండ్ అవుతున్నాం. సంక్రాంతికి 'కాకా' వస్తున్నాడు, అసలైన పండగ తెస్తున్నాడు" అని కోన వెంకట్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ఒక్క ప్రకటనతో సినిమా విడుదల తేదీపై ఉన్న అనుమానాలకు ఆయన పూర్తిస్థాయిలో చెక్ పెట్టారు. చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రబృందం ఒకేసారి చిత్రీకరణ, డబ్బింగ్ పనులను సమాంతరంగా జరుపుతూ సినిమాను వేగంగా పూర్తి చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా పంచుకుని, పనులు ఎంత వేగంగా సాగుతున్నాయో తెలియజేసింది.

వచ్చే ఏడాది సంక్రాంతి బరి హోరాహోరీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వెంకటేశ్, కల్యాణ్ రామ్ నటిస్తున్న చిత్రాన్ని అనిల్ రావిపూడి దర్శకత్వంలో జనవరి 12న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సూపర్ స్టార్ రజినీకాంత్ 'ధర్మన్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇదే పండక్కి పోటీ పడనున్నాయి. ఈ నేపథ్యంలో 'కాకా' రాకను చిత్రబృందం ధృవీకరించడం ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది


కీరవాణి ఇంట శుభకార్యం..

ఘనంగా కుమారుడి నిశ్చితార్థం!



టాలీవుడ్‌లో మరోసారి పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి కుటుంబంలో శుభకార్యం జరిగింది. ఆయన పెద్ద కుమారుడు, యువ గాయకుడు, సంగీత దర్శకుడు కాలభైరవ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. 'బలగం' సినిమాతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ కావ్య కల్యాణ్‌రామ్‌తో ఆయన నిశ్చితార్థం జరిగింది. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుకను నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.ఈ నిశ్చితార్థ వేడుకకు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఆయన భార్య రమా రాజమౌళి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. సంప్రదాయ దుస్తుల్లో కాలభైరవ, కావ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంతో ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు బయటకు రావడంతో అభిమానులు, సినీ ప్రముఖులు నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.కాలభైరవ తన తండ్రి బాటలో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టి గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. మరోవైపు కావ్య కల్యాణ్‌రామ్ బాలనటిగా కెరీర్ ప్రారంభించి, 'మసూద', 'బలగం' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ముఖ్యంగా 'బలగం' చిత్రంలోని ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇరు కుటుంబాల అంగీకారంతో జరగనున్న వీరి వివాహాన్ని డిసెంబర్‌లో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తేదీ, వేదిక వంటి పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా, ఇటీవలే సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ తన ప్రేయసితో నిశ్చితార్థం చేసుకున్నారు. హీరో తేజ సజ్జా కూడా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు కాలభైరవ, కావ్యల పెళ్లి వార్తతో టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి నెలకొంది.





'రామాయణ'పై రకుల్ ప్రీత్ సింగ్ భావోద్వేగం

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'రామాయణ' చిత్రం నవంబర్ 6న విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సినిమాలో కీలకమైన శూర్పణఖ పాత్రను నటి రకుల్ ప్రీత్ సింగ్ పోషించారు. తాజాగా ఈ పాత్రలో నటించడంపై తన అనుభవాలను, సంతోషాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు."శూర్పణఖ పాత్ర పోషించడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన ప్రయాణం. భారతీయ సంస్కృతిలో భాగమైన రామాయణాన్ని ఇంత భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది" అని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ఆలోచనను కార్యరూపంలో పెట్టిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచానికి భారత్ నుంచి ఓ అద్భుతమైన చిత్రాన్ని అందించాలన్న వారి తపన తనకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు.ఈ సినిమాలో తన సహనటులైన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా, రోజూ నాలుగు గంటల పాటు శ్రమించి తనను శూర్పణఖగా సిద్ధం చేసిన కాస్ట్యూమ్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా తాను ఎంతో గర్వపడే క్షణం అని రకుల్ తన పోస్టులో ఉద్వేగంగా రాసుకొచ్చారు.

సురేఖ వాణి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్..

ప్రైవేట్ కంటెంట్ వైరల్ కావడంతో నటి ఆగ్రహం!



ప్రముఖ తెలుగు నటి సురేఖ వాణి సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేసిన కొందరు దుండగులు, ఆమెకు సంబంధించిన వ్యక్తిగత కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడంతో ఈ విషయం కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంపై సురేఖ వాణి తీవ్రంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయిందని, దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు తన ప్రైవేట్ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యూస్, లైక్స్ కోసం బాధ్యతారహితంగా ప్రవర్తించవద్దని మీడియా సంస్థలకు, యూట్యూబ్ ఛానెల్లకు, మీమ్ పేజీలకు ఆమె సూచించారు. తన వ్యక్తిగత కంటెంట్‌ను షేర్ చేయడం లేదా రీపోస్ట్ చేయడం వెంటనే ఆపేయాలని స్పష్టం చేశారు.ఇది తన వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన సున్నితమైన విషయమని, దీన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని సురేఖ వాణి స్పష్టం చేశారు. తన హెచ్చరికలను బేఖాతరు చేసి ఎవరైనా ప్రైవేట్ కంటెంట్‌ను ప్రచారం చేస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు సదరు కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, తన ప్రైవసీని గౌరవించాలని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు.

పదేళ్ల వయసులోనే గొప్పగా ఊహించుకున్నా..



ప్రముఖ మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో.. అద్భుతమైన నటనతో ఆడియన్స్ ను ఆకట్టుకుంటూ విపరీతమైన ప్రజాధారణ సొంతం చేసుకుంది . మలయాళం ప్రేమమ్ సినిమాతో ఇటు తెలుగు ప్రేక్షకులను కూడా పలకరించిన ఈమె.. తొలిసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో సమంత, నితిన్ కాంబినేషన్లో వచ్చిన 'అ ఆ' చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా నటించి, తన అద్భుతమైన నటనతో ఆడియన్స్ లో అటెన్షన్ క్రియేట్ చేసింది. ఆ తర్వాత శర్వానంద్ హీరోగా నటించిన 'శతమానం భవతి' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అనుపమ. ూశ్రీంశీ =ఘఒ – 'వారణాసి' చేస్తూ ఈ ప్రయోగం ఎందుకు పీసీ? ఆ తర్వాత పలు చిత్రాలు చేసినా ఈమెకు పెద్దగా సక్సెస్ రాకపోవడంతో కొంతకాలం ఇండస్ట్రీకి బ్రేక్ ఇచ్చి.. మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రీ ఎంట్రీలో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకోవడమే కాకుండా బోల్డ్ పాత్రలు కూడా చేసి మెప్పించింది అనుపమ. అలాంటి ఈమె ఇటీవల కిష్కింధపురి, పరదా, బైసన్ వంటి చిత్రాలలో నటించింది. సాధారణంగా ఇన్ని రోజులు రూమర్స్ కి దూరంగా ఉన్న అనుపమ పరమేశ్వరన్.. బైసన్ సినిమా సమయంలోనే ఆ చిత్ర హీరో, ప్రముఖ హీరో కొడుకు, యంగ్ హీరోతో ప్రేమలో పడినట్లు, ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. అయితే ఆ రూమర్లపై అనుపమ పరమేశ్వరన్ స్పందించలేదు. కానీ తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా రెండేళ్ల పాటు తాను టాక్సిక్ రిలేషన్ లో ఉన్నాను అని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రేమ అంటే ఒకరి స్వతంత్రాన్ని లాగేసుకోవడం కాదు అని చెప్పిన అనుపమ.. రెండేళ్లపాటు తాను నరకం చూసానని చెప్పుకొచ్చింది. అంతేకాదు తాను ప్రేమలో పడకముందు పెళ్లి చేసుకొని,చాలామంది పిల్లలను కణాలని కలలు కన్నట్లు చెప్పుకొచ్చిన ఈమె.. అతడితో రిలేషన్ బ్రేకప్ తర్వాత అసలు ప్రేమ, పెళ్లి , పిల్లలు అంటేనే భయమేస్తోంది అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. మె.. ఇటీవలే క్రేజీ కల్యాణం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే ఇప్పుడు మరోసారి శర్వానంద్ తో కలిసి భోగి సినిమాలో నటిస్తోంది. ఇదిలా ఉండగా.. అనుపమ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం తన సినిమా షూటింగ్ లతో బిజీగా ఉంటూనే .. ఇటు ఖాళీ సమయం దొరికితే చాలు పలు రీల్స్ చేస్తూ సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా షేర్ చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటుంది. అద్భుతం ఆవిష్కారం సూర్య, భూమిక కాంబినేషన్లో వచ్చిన నువ్వు నేను ప్రేమ సినిమాలోని "ప్రేమించే ప్రేమవా" అనే మ్యూజిక్ ను షేర్ చేస్తూ.. ఒక గేటు పట్టుకొని సరదాగా ఆ మ్యూజిక్ ని ఫీల్ అవుతున్నట్లు ఆ వీడియోని షేర్ చేసింది. పైగా ఈ వీడియోకి క్యాప్షన్ గా.."పదేళ్ల వయసులోనే నేను, సన్ మ్యూజిక్ కి అతుక్కుపోయి.. ఈ పాటను పదేపదే వింటూ ప్రేమ, శృంగారం ఎలా ఉంటాయో ఊహించుకొనే దాన్ని" అంటూ చెప్పుకొచ్చింది . మొత్తానికైతే ఈ క్యాప్షన్ కాస్త వైరల్ కావడంతో ఇది చూసిన నెటిజన్స్.. పదేళ్ల వయసులోనే ఎన్నో ఊహించుకున్న ఈమె.. ఇప్పుడు యుక్త వయసుకు వచ్చాక అతడి కారణంగా ప్రేమ అంటేనే భయపడే స్టేజ్ కి చేరుకుందా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అనుపమ షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.